
క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలందుకుంటున్న కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి బంగారు వస్తువుల బహూకరణ



ఆలయ పర్యవేక్షకునికి బంగారు వస్తువులు అందజేస్తున్న హైదరాబాద్‌కు చెందిన భక్తులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, ఆంధ్రుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి హైదరాబాద్‌కు చెందిన గనల రామ్‌ప్రసాద్, వల్లి సంయుక్తంగా 19 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారు చైన్, రెండు మంగళ సూత్రాలు ఆలయ పర్యవేక్షకుడు ఎంవీ రమణకు శుక్రవారం అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు.

పాత పెన్షన్ స్కీం కొనసాగించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

సీతమ్మధార : కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము రద్దు చేసి పాత పెన్షన్ స్కీము అమలు చేయాలని, ఉద్యోగులపై వేధింపులు ఆపాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, వెంకటరావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులకు సూచనలు చేస్తున్న నిర్వాహకులు


దాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో డెక్కన్ కెమికల్స్, శ్రీసాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో కెమిస్ట్రీ విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 20 మంది విద్యార్థులు అధిక వేతన ప్యాకేజీకి ఎంపికయ్యారు. కళాశాల ప్లేస్‌మెంట్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన, కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి ఎ. అర్చన పర్యవేక్షణలో ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డి. సంతోష్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త పి. కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెరుస్తున్న రోడ్లు

నగరంలోని దక్షిణ నియోజకవర్గంలో గల పలు వార్డులు.. మెయిన్ రోడ్లు.. ఐల్యాండ్‌లు ఆహ్లాదాన్ని చాటుతున్నాయి. మెయిన్‌రోడ్లు మెరుస్తున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ వెలుగులు విరాజిల్లుతున్నాయి.



జగదాంబ జంక్షన్‌లో కొత్తగా వేసిన రోడ్డు



డాబాగార్డెన్స్‌లో నూతనంగా మెయిన్ రోడ్డు వేసి..మీడియన్‌కు రంగులు, (ఇన్‌సెట్) హోటల్ గ్రీన్‌పార్క్ రోడ్డు ఇలా..

- దక్షిణం దారులకు కొత్త సోయగాలు
- జి–20 సదస్సు నేపథ్యంలో చకచకా తుది మెరుగులు

దాబాగార్డెన్స్: గత ఏడాది పీఎఫ్‌ఆర్ పుణ్యమా అంటూ రోడ్లు వేశారు. ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టారు. పార్కులు సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు వెలగించారు. ఈ పనులన్నీ చేపట్టి దాదాపు ఏడాదైంది. మళ్లీ ఈ ప్రాంతానికి అంతర్జాతీయ సదస్సు పుణ్యమా అంటూ మంచి రోజులు వచ్చాయి. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న జి–20 సదస్సు దృష్ట్యా కోట్లాది రూపాయలతో పలు సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. జి–20 వర్కింగ్ గ్రూప్ సమావేశానికి విచ్చేయనున్న జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర ప్రతినిధులకు 29వ వార్డు పరిధి బీచ్‌రోడ్డులో గల నోవాటెల్ హోటల్లో ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో ఆ దారిలో వెళ్లే ముఖ్యమైన రహదారులు, ఉప రహదారులను సుందరీకరిస్తున్నారు. నోవాటెల్ హోటల్ కూడలి నుంచి గ్రీన్‌పార్క్ హోటల్ కూడలి వరకు బీటీ రెన్యువల్ లేయర్, రోడ్‌లైన్ మార్కింగ్, స్టడ్స్ వంటి పనులు చేపడుతున్నారు. రూ.కోటీ 99 లక్షలతో ఆ పనులు ప్రారంభించారు. అలాగే సిరిపురం జంక్షన్ ద్రోణంరాజు సర్కిల్ నుంచి జగదాంబ కూడలి వరకు బీటీ రెన్యువల్ లేయర్ వేస్తూ, ఫుట్‌పాత్ మరమ్మతులు, రోడ్‌లైన్ మార్కింగ్, స్టడ్స్‌ను రూ.కోటీ 93 లక్షల 90 వేలతో పూర్తి చేయనున్నారు.

అదే విధంగా పందిమెట్ట కూడలి నుంచి జిల్లా పరిషత్ కూడలి వరకు, గోకుల్‌రోడ్డు, సెంచురీక్లబ్ రోడ్డు, జిల్లా పరిషత్ కూడలి నుంచి కోస్టల్ బ్యాటరీ కూడలి వరకు ఫుట్‌పాత్ మరమ్మతులు, కొత్త ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టేందుకు రూ.కోటీ 93 లక్షల 90 వేలతో పనులు ప్రారంభమయ్యాయి. నెక్సాన్ కార్ల షోరూమ్ కూడలి నుంచి పందిమెట్ట కూడలి జంక్షన్ వరకు, నౌరోజీరోడ్డులో గల గ్యాస్ గొడౌన్ నుంచి నేవీ హౌస్ వరకు బీటీ రెన్యువల్ లేయర్ వేస్తూ, ఫుట్‌పాత్ మరమ్మతులు, కొత్త ఫుట్‌పాత్ నిర్మాణం, రోడ్‌లైన్ మార్కింగ్, స్టడ్స్ ఏర్పాటుకు రూ.కోటీ 71 లక్షలు కేటాయించారు. ఇంకా అనేక విధాలుగా అభివృద్ధి పనులు చేస్తూ సదస్సుకు వచ్చే అతిథులకు ఆహ్లాదం పంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

అల్లిపురం: రక్తం కొరతతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, దానికి ప్రధాన కారణం రక్తదానం చేయకపోవడమేనని పైడా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ అన్నారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పైడా డిగ్రీ కళాశాల, పైడా ఉమెన్స్ కళాశాల, రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు సహకారంతో రెడ్డంగార్డెన్స్ పైడా కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ పైడా రమాదేవి, రోటరీక్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు ఆర్. సుబోత్ కుమార్, సెక్రటరీ వి.ఉషామాధవి, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ ఎ.సుగంధిని హాజరయ్యారు. ఈ సందర్భంగా పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ముగ్గురిని కాపాడవచ్చన్నారు. విద్యార్థుల్లో రక్తదానంపై చైతన్యం తీసుకురావమే తమ ఉద్దేశమన్నారు.

అనాథలకు ఆపన్నహస్తం



అనాథలకు అన్నదానం చేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురంలోని హెలెన్ కిల్లర్ మెమోరియల్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్‌లో శుక్రవారం అనాథలు, మానసిక రోగులకు అన్నదానం, నిత్యావసర సరకుల పంపిణీ జరిగింది. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెళంగిణిరావు, సుధాకర్, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

12న గంటి అభినయ్‌చే సినీ గీతాలాపన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కందర్ప రాధ, ఎంవీ రాజశేఖర్, సత్యనారాయణ

దాబాగార్డెన్స్: రాగమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో «చెప్పవే చిరుగాలి..చల్లగా ఎదగాలికి» పేరిట తెలుగు చలనచిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు రాగమయి వ్యవస్థాపకురాలు కందర్ప రాధ తెలిపారు. ఈ మేరకు నగరంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరానికి చెందిన వర్ధమాన యువ గాయకుడు గంటి అభినయ్ 3 గంటల పాటు నిర్విరామంగా గాయనీమణులతో ప్రేక్షకాదారణ పొందిన సినీ గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, మెలోడి క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, వర్ధమాన యువ గాయకుడు గంటి అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకాలు

దాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్సీ/ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో గల పలు పోస్టులకు ఎన్నికల కన్వీనర్ ఆధ్వర్యంలో శుక్రవారం నియామకం చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం. దేవీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి. ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పి. ప్రసన్నకుమార్, డాక్టర్ టీఎస్ దీప్తిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల కన్వీనర్‌గా ఎంఎన్‌ఎస్‌ఎస్ సింగ్ వ్యవహరించారు.

యువకుడి ఆత్మహత్య



ప్రసాద్ మృతదేహం

కూర్మన్నపాలెం(గాజువాక): అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్(21) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్ డిగ్రీ చదువుతున్నాడు. మృతుడి తండ్రి కనక అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ప్రసాద్‌కు కాలేయానికి సంబంధించిన శస్త్ర జరిగింది. ఈ ఏడాది జనవరిలో అప్పారావుకు హార్ట్ ఆపరేషన్ అయింది. తండ్రి కూడా అనారోగ్యానికి గురవ్వడంతో ప్రసాద్ సరిగ్గా తిండి తినక, మందులు వాడకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ప్రసాద్ తరచూ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వడ్లపూడిలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఇది ఇలా ఉండగా గురువారం రాత్రి తండ్రి అప్పారావు నరవలోని ఓ పెళ్లికి హాజరవ్వగా, మృతుడి తల్లి, చెల్లి ఎస్.కోటలోని మరో పెళ్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రసాద్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షోభంలో మైనారిటీల సంక్షేమం

- ఫారూఖ్ షిబ్లీ

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమం సంక్షోభంలో పడిందని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ ఆరోపించారు. విశాఖపట్నం పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన శుక్రవారం దాబాగార్డెన్స్‌లో గల వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.వక్ఫ్‌బోర్డు ఆస్తులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి లీగల్ టీమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం, సభ్యులు షబ్బీర్, ఇమ్రాన్, ఇషాక్ మదీనా, అబ్దుల్ సత్తార్, షాహిద్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రత.. అందరి బాధ్యత



భద్రత ఫ్యాషన్ షోలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

సీతంపేట : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ ఇంజినీరింగ్ అండ్ సేఫ్టీ (ఎన్‌ఐఎఫ్‌ఎస్)ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 'భద్రతకు స్వాగతం పలుకుదాం, ప్రమాదాలకు స్వస్తి చెబుదాం' స్ఫూర్తితో నిర్వహించిన వారోత్సవాలలో విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.వి.కృష్ణయ్య, జిల్లా ఫైర్ ఆఫీసర్ జె.మోహన్‌రావు, కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.వి.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నైతిక విలువలతో పాటు భద్రత యొక్క ఆవశ్యకతను తెలియపరచాలన్నారు. మోహన్‌రావు మాట్లాడుతూ భావితరాలకు భద్రత కలిగిన సమాజాన్ని అందించాలని, అది మనందరి బాధ్యతని అన్నారు. ఎన్‌ఐఎఫ్‌ఎస్ చైర్మన్ సునీల్ మహంతి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉన్నతమైన భవిష్యత్‌ను భద్రతా విభాగంలో కల్పించడమే తమ సంస్థ ఉద్దేశమని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన భద్రతా ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. రక్షణ సామగ్రి ధరించి వాటిని ఉపయోగించే విధానం, అవసరాన్ని తెలియపర్చేలా ప్రదర్శించిన ఫ్యాషన్ షో అలరించింది. కార్యక్రమంలో విభాగాధిపతులు కె.కుసుమ కుమారి, యశోద, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు గొలుసు వితరణ



బంగారు గొలుసును ఏఈవోకు అందజేస్తున్న దాత గౌరీశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన మళ్ల గౌరీ శంకర్ అనేదాత సుమారు 42.730గ్రాముల బంగారం గొలుసు కానుకగా ఇచ్చారు. ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన దాత గొలుసును ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, సిబ్బంది సాంబ, నాయుడు పాల్గొన్నారు.

చిలుకలు కావు.. పువ్వులే..!



చిలుకల ఆకారంలో రంగుల పువ్వులు

ఆరిలోవ : రంగు రంగుల చిలుకలు.. ఒక దానిపై మరొకటి వాలినట్లున్నాయి కదూ..! ముచ్చనైలతో ఈ చిలుకలు ఎంత అందంగా ఉన్నాయో..! అంటూ చూసేవారంతా కాసేపు అక్కడే నిల్చుని.. కళ్లారా చూశాక గానీ అసలు విషయం తెలుసుకోలేకపోతున్నారు. తీరా తెలిశాక ఆశ్చర్యపోవడం వారి వంతవుతోంది. హనుమంతవాక దరి ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆవరణలో వివిధ రకాల పూల మొక్కలున్నాయి. ఇవి ఇక్కడకు కంటి సమస్యలతో వచ్చిన వారిని, వారి సహాయకులను ఆకర్షిస్తున్నాయి. వాటిలో తీగ మొక్కలకు గులాబీ, పసుపు, ఆకుపచ్చని రంగులతో కూడిన పూలు వేలాడుతున్నాయి. ఈ పూలు తీగకు రెండు పక్కల ఒకదానిపై మరొకటి వరుసగా పేర్చినట్టున్నాయి.

అడుగంటిన జూ కొలను



జూ కొలనులో అడుగంటిన నీరు



ఎండిపోయిన కొలను వెనుక భాగం

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో కొలను ఎండిపోతోంది. వేసవి ఎండలు రాకముందే ఇక్కడ నీరు ఆవిరైపోయింది. దీంతో అడుగు భాగంలోనే కొద్దిగా నీరు కనిపిస్తుంది. ఇందులో నిండుగా నీరు ఉన్నప్పుడు వన్యప్రాణులతో పాటు ఈ కొలను కూడా సందర్శకులను అలరించేది. ఇందులో చేపల కోసం పక్షులు నిత్యం కొలను చుట్టూ చేరి కిలకిలారావాలతో సందడి చేసేవి. చుట్టూ పచ్చదనం కనువిందు చేసేది. జూ లోపల కొండలపై స్వేచ్ఛగా సంచరించే కనుజులు, జింకలు సాయంత్రం వేళల్లో దాహం తీర్చుకుంటూ.. సేద తీరేది ఇక్కడే. ప్రస్తుతం ఈ కొలనులో నీరు అంతకంతకూ అడుగంటిపోతుండటంతో పక్షులకు, జంతువులకు తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు. మార్చి రెండో వారానికే ఇలా ఉంటే.. ఎండలు తీవ్రరూపం దాల్చే ఏప్రిల్, మేలో పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. దీంతో ఇప్పటి నుంచే వన్యప్రాణుల సంరక్షణకు జూ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయక తప్పదు.

ఎమ్మెల్సీగా సీతంరాజును గెలిపించాలి



వెంకటేశ్వరమెట్టపై ప్రచారం చేస్తున్న రంథి గోపి తదితరులు



విద్యావంతులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం 33వ వార్డు పార్టీ అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ ఆధ్వర్యంలో అల్లిపురంలోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆడారి వెంకట మహేష్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

దాబాగార్డెన్స్: సీతంరాజు సుధాకర్ గెలుపునకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టారు. 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలకొండమ్మతో కలిసి వార్డు పరిధిలో గల విద్యావంతులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వార్డు పరిధిలో గల సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, తాడివీధి, ఏనుగుల వీధి, సాలిపేట, కేజీహెచ్ వార్డుభాయ్స్‌కాలనీ, జగదాంబ సర్కిల్, ఆరీఫ్ ఆప్టికల్స్ సందు, రెవెన్యూ కార్యాలయం, ఎండోమెంట్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి డోర్ స్టిక్కర్, ప్రచార కరపత్రాని అందజేశారు. కార్యక్రమంలో దశమంతుల మాణిక్యాలరావు, పి. సత్యనారాయణ, తాడి రవితేజ, వడ్డాది దిలీప్‌కుమార్, దశమంతుల చిన్ని, అన్నామణి, వేణు, వెంకట్, జగన్, అప్పలరాజు, నానాజీ, రామలక్ష్మి, కల్యాణి, మణి, మీనా తదితరులు పాల్గొన్నారు.

37వ వార్డులో..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ శుక్రవారం వార్డు పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో గ్యాడ్యుయేట్ ఓటర్లకు ఓటర్ స్లిప్పులు, కరపత్రాలు అందజేశారు. వాల్ స్టిక్కర్స్ అంటించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు యేసు, కాసారపు వాసు, రెయ్యి డేవిడ్‌రాజు, గోపి, ఆనంద్, వెంకటలక్ష్మి, రోజా, రమణి, జి. శేఖర్, వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

41వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గల సచివాలయాలు, జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, స్లీపర్సుట్టువీధి, సెబాస్టియన్ ప్రాంతాల్లో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నిఖిలేష్ రాజ్‌కుమార్, నాయకులు గవర రమణ, ప్రమీలా, పిల్లి గోవింద్, కాంతమ్మ, లక్ష్మి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజుకే మా మద్దతు : ఏపీ టీచర్స్ యూనియన్

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.దేముడు, జి.దత్తాత్రేయశర్మ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, నిరుద్యోగ సమస్యలను ఎమ్మెల్సీగా గెలిస్తే సీతంరాజు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఈ విషయాన్ని గుర్తించి ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



ఏవీఎన్ కళాశాలలో ప్రచారం చేస్తున్న 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్



పట్టభద్రులకు కరపత్రాలు అందిస్తున్న యాండ్రపు ఫాతిమారాణి

ట్రాఫిక్‌ను నియంత్రించిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..



కళా ఆస్పత్రి రోడ్డులో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు కళా ఆస్పత్రి రోడ్డులో ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించారు. గురువారం సాక్షి దినపత్రికలో «ఇరుకు దారిలో భారీ వాహనాలు» శీర్షికన వార్త వెలువడింది. దీంతో శుక్రవారం ఉదయం ఆ రోడ్డులోకి భారీ వాహనాలు రాకుండా ద్వారకా పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించారు. భారీ వాహనాలు ఆ రోడ్డులోకి రాకుండా చర్యలు చేపట్టడంతో పాటు ఆ రోడ్డులో అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాలను క్లియర్ చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా వచ్చిన భారీ వాహనదారుడిపై రూ.1,035 ఫైన్ వేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలతో వాహనచోదకులు, పాదచారులు ఊపిరి పీల్చుకున్నారు.

వర్క్ ఫ్రం హోమ్‌తో బహుళ ప్రయోజనాలు



నివేదిక విడుదల చేస్తున్న సిడార్ సంస్థ ప్రతినిధులు

సీతంపేట(విశాఖ ఉత్తర): కోవిడ్ మహమ్మారి కారణంగా వెలుగులోకి వచ్చిన వర్క్ ఫ్రం హోమ్ విధానం అటు వ్యాపార సంస్థలు, ఇటు ఉద్యోగులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చిందని సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్(సిడార్) చైర్మన్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి తెలిపారు. ఇంటి నుంచి పని, ఉద్యోగుల దృక్పథాలు అనే అంశంపై సంస్థ చేపట్టిన సర్వే నివేదికను శుక్రవారం బుల్లయ్య కళాశాలలో జరిగిన సదస్సులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు వర్క్ ఫ్రం హోమ్ విధానం లేకపోయినప్పటికీ వ్యాపార, సాఫ్ట్‌వేర్ సంస్థలు వాటి మనుడగ కోసం ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడం తప్పనిసరైందన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగుల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు వారి జీవన విధానంలో మంచి సౌలభ్యం లభించిందన్నారు. ఈ సర్వేలో చాలా ఆసక్తికరమైన విషయాలు తెలిశాయని, వాటన్నింటిని క్రోడీకరించి నివేదిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో సిడార్ ప్రతినిధులు డాక్టర్ జి.మధుకుమార్, పలువురు ప్రొఫెసర్లు బాలమోహన్‌దాస్, రామకృష్ణారావు, హరినారాయణ, పి.విజయప్రకాష్, హెచ్.ఎల్.ఎన్.దొర, ఎల్.డి.సుధాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వెంకన్నకు సమర్పిస్తామని, భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.